క్లుప్తంగా

నాగేశ్వరరావుకు అభినందనలు



నాగేశ్వరరావుని అభినందిస్తున్న ప్రముఖులు

ఏలూరు (టూటౌన్): ఏలూరుకు చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితులు ఎం వీవీఎస్ నాగేశ్వరరావు సిద్ధాంతికి సువర్ణ సింహ తలాట కంకణ ధారణ ఘనంగా జరిగింది. జ్యోతిష్య రంగంలో 25 ఏళ్లుగా సేవలందిస్తున్నందుకు గాను నిడదవోలుకు చెందిన ఏలియన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఈ పురస్కారాన్ని ప్రధానం చేసింది. కంకణంతోపాటు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. నాగేశ్వరరావు సిద్ధాంతి జ్యోతిష్య రంగంలో చేసిన విశేష కృషికి పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు బండి సత్యనారాయణ, కే వెంకటేశ్వరరావు, మద్దిపాటి రామకృష్ణ, కేవీ బ్రహ్మం, కృష్ణంరాజు, సీహెచ్ భీమేశ్వరరావు, వై జ్ఞానదాసు, రమేష్, తదితరులు అభినందించారు.

నేత్రపర్వం..గ్రామోత్సవం



అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు తంగెళ్ళమూడి 28వ డివిజన్‌లో సీతారామ నగర్ చెరువుగట్టుపై వేంచేసియున్న శ్రీ విఘ్నేశ, శ్రీరామాలయ, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దసరా మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారి సంకీర్తనలతో భజనలు చేశారు. అనంతరం అమ్మవారిని నిమజ్జన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ కాలనీ, లునాని నగర్, లక్ష్మి నగర్, సీతారామ నగర్ చెరువుగట్టు ప్రజలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న సీఐ రాజశేఖర్

దెందులూరు: దోసపాడులో పెదవేగి సీఐ రాజశేఖర్ పోలీస్ గ్రామసభ నిర్వహించారు. మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ మద్యం దుర్వినియోగంపై ప్రభుత్వ చర్యలు, శిక్షలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వివాదాలకు దూరంగా ప్రశాంత జీవనం కొనసాగించాలన్నారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై పూర్తి స్థాయి నిఘా ఉంటుందన్నారు.

క్షేత్రంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



శ్రీవారి కొండపైన భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. విజయవాడ దుర్గమ్మ ఆలయంలో దీక్షలు విరమించిన అనంతరం భవానీ భక్తులు చినవెంకన్న ఆలయానికి చేరుకుంటున్నారు. దీంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో పోటెత్తుతున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, తూర్పు రాజగోపుర ప్రాంతం, షాపింగ్ కాంప్లెక్స్, అన్నదాన భవనం వద్ద భక్తులు కిటకిటలాడారు.

ఆడబిడ్డలకు సర్కార్ టోకరా..!

- సూపర్ సిక్స్..అంతా మోసమే
- ఆడబిడ్డ నిధిపై ఊసెత్తని ప్రభుత్వ పెద్దలు
- బాబు హామీలతో మోసపోయామంటున్న మహిళలు



బాబు ష్యూరిటీ..భవిష్యత్ గ్యారెంటీ పేరుతో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు



నిరుద్యోగ భృతి, అందించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు(ఫైల్)

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వ 15 నెలల పాలన అంతా దగా..మోసమే అంటూ ఏలూరు నియోజకవర్గ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ హామీలు గుమ్మరించి వాటిని పూర్తి స్థాయిలో నెరవేర్చకుండా ప్రజల్ని నమ్మించి మోసం చేసారంటూ విమర్శిస్తున్నారు. నిరుద్యోగులు ప్రతి నెలా రూ.3వేలు నిరుద్యోగ భృతి, ప్రతి మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏటా రూ.20వేలు పెట్టుబడి సాయం అందిస్తామంటూ ఊదర గొట్టారు. కట్ చేస్తే అధికారం చేపట్టి నేటికి 15 నెలల కాలం పూర్తయినా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చలేదు. గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించినా ఆదిలోనే హంసపాదులా ఆ పథకం తయారైంది. మోసపూరిత, అబద్దపు హామీలతో అందల మెక్కిన కూటమి నాయకులు ప్రజల్ని మోసం చేసారని ఏలూరు నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఏవి బాబూ..

ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్న ప్రభుత్వం దాన్ని సైతం అటకెక్కించింది. పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించి మొదటి సిలిండర్ కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఊదరగొట్టింది. సగం మందికి మాత్రమే గ్యాస్ సిలిండర్ సొమ్ములు వారి బ్యాంకు ఖాతాల్లో పడగా మిగిలిన వారికి ఎదురు చూపే మిగిలింది. ఏడాది పాలన పూర్తయినా ఇప్పటి వరకు ఒక్క సిలిండర్‌కు సంబంధించి కూడా పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరలేదు. ఏలూరు నియోజకవర్గంలో 86, 516 కుటుంబాలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని నియోజకవర్గంలో 50 వేల వరకు అర్హత కలిగి ఉన్నారు. మొదటి సిలిండర్ సొమ్ములు కేవలం 25వేల లోపు లబ్ధిదారులకే పడ్డాయి. మిగిలిన వారు ఎప్పుడు పడతాయా అంటూ ఎదురు చూస్తున్నారు. ఏడాది దాటినా ఒక్క సిలిండర్‌కే పరిమితం చేసి మిగిలిన రెండు సిలిండర్‌లకు ఎగనామం పెట్టారు.

ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఎప్పుడు ఇస్తారు..?

19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు మధ్య ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సహకారం అందిస్తామని సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడాదిన్నర అయింది. ఆడబిడ్డల నిధి ఎప్పుడు ఇస్తారంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తాము వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, అమ్మ ఒడి వంటి పథకాలలో పొందిన మొత్తానికన్నా ఎక్కువ మొత్తం అందేలా చూస్తామంటూ నమ్మ బలికి తీరా అధికారంలోకి వచ్చాక మొండి చేయి చూపడం బాబు నైజంగా మారిపోయిందని మహిళలు విమర్శిస్తున్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఏదీ..?

రైతులకు ప్రతి ఏటా పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఆర్థికసాయం అందిస్తామంటూ నమ్మ బలికారు. ఏడాదిన్నర పూర్తయినా ఇంత వరకు ఈ పథకంలో కేంద్రం విడుదల చేసిన నామమాత్రపు సొమ్ములు మినహా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందించింది ఏమీ కన్పించ లేదు. దీంతో ఏలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న 10 వేల మందికి పైగా రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఏటా రూ.13,500 ఆర్థిక సాయం అందజేసిందని, ఆ సొమ్ము తమకు ఎంతగానో అక్కరకు వచ్చిందని రైతులు గత పాలనను గుర్తు చేసుకోవడం కన్పిస్తుంది. అన్నదాతలను ఉసూరు మనిపిస్తే ఆ నాయకులకు పుట్టగతులు ఉండవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగ భృతి ఊసే లేదు..?

తాము అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందజేస్తామంటూ సూపర్‌సిక్స్‌లో మొదటి హామీగా హడావుడి చేశారు. తీరా అధికారం చేపట్టి ఏడాది దాటినా ఇంత వరకు దీని ఊసే ఎత్తకు పోవడం రాష్ట్రంలోకూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా కన్పిస్తుందని నిరుద్యోగులు విమర్శిస్తున్నారు. కొత్త ఉద్యోగాలు లేవు..ఉన్న ఉద్యోగాలను ఊడ బీకుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు నియోజకవర్గ జనాభా దాదాపు 3.70 లక్షల వరకు ఉంది. చదువుకుని ఉద్యోగాలు రాని నిరుద్యోగులు 10 శాతం చొప్పున నియోజకవర్గంలో సుమారు 35 వేల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

సూపర్ సిక్స్ హామీలను ఎప్పుడు అమలు చేస్తారు



కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలైన సూపర్ సిక్స్ హామీలను తక్షణం పూర్తి స్థాయిలో అమలు చేయాలి. నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు ఆర్థిక సాయం అందిస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. గత 15నెలలుగా నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్న యువతకు నేటికీ నిరుత్సాహమే మిగిలింది. తక్షణం నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు అందించాలి.

పి.కిషోర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు, ఏలూరు

మహిళలకు ఆడబిడ్డ నిధి అందజేయాలి



ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సూపర్ సిక్స్ పేరిట హామీలను ఊదర గొట్టారు. తీరా గెలిచాక నేడు వాటి ఊసే ఎత్తడం లేదు. ఆడబిడ్డ నిధి పేరుతో మహిళలకు నెలకు రూ.1500 అమలు కావడం లేదు. కూటమిప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులు, మహిళలను నమ్మించి మోసగించింది. హామీలను ఇవ్వడం వాటిని తుంగలోకి తొక్కడం పాలకుల నైజంగా మారిపోయింది.

బి.సోమయ్య,సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ,ఏలూరు

రీసర్వే ప్రారంభం

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో మూడు గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభమయ్యాయని తహసీల్దార్ బి.సుమతి అన్నా రు. దెందులూరు మండలం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర, మండల సర్వేయర్ రమణారావు అన్ని గ్రామాల సర్వేయర్‌లు, వీఆర్వోలు, వీఆర్ఏలు సమష్టిగా నాగులదేవుని పాడు 638 ఎకరాలు, సింగవరంలో 774 ఎకరాలు, వేగవరంలో 738 ఎకరాలు, గోపన్నపాలెంలో 423 ఎకరాల్లో సరిహద్దుల ఏర్పాటు ప్రక్రియ నిర్వహిస్తున్నారు. రీ సర్వే పనులు పూర్తి స్థాయి పారదర్శకంగా చేస్తున్నారని తెలిపారు. ఆదివారం వేగవరం, సింగవరం నాగులదేవుని పాడు గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను తహసీల్దార్ సుమతి, రీసర్వే డీటీ రవిచంద్ర పరిశీలించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

దెందులూరు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్ రిపేర్‌లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తామని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ప్రతినిధి శిరోమణి అన్నారు. ఆదివారం దెందులూరులో ఆమె మాట్లాడుతూ ఏలూరులో ఉచితంగా 30 రోజుల శిక్షణ ఇస్తామన్నారు. వయసు 19 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని ఐదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఉచిత నివాసం, భోజనం మెటీరియల్ శిక్షణ సమయంలో ఇస్తామని గ్రామీణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ధర్నాను విజయవంతం చేయండి

కొయ్యలగూడెం: విద్యా రంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఏడో తేదీ విజయవాడలో చేపట్టిన ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఒక ప్రకటనలో కోరారు. బోధనేతర పనులైన యాప్‌ల నిర్వహణ తగ్గించాలని, విద్యార్థులకు ఎటువంటి అదనపు ప్రయోజనం లేకుండా, ఉపాధ్యాయులకు అదనపు భారంతో పాటు బోధన సమయాన్ని హరించి వేసే అసెస్‌మెంట్ బుక్లెట్ విధానాన్ని రద్దు చేయాలనే తదితర డిమాండ్లతో ధర్నాకు పిలుపు ఇచ్చామన్నారు.

ప్లాస్టిక్ నిషేధం మూడు నెలల ముచ్చటే..!

- పూర్తిస్థాయిలో అమలుకు నోచుకుని ప్లాస్టిక్ నిషేధ చర్యలు
- కిరాణా, చేపలు, మాంసం దుకాణాల్లో యథేచ్ఛగా వినియోగం
- సాధారణ తనిఖీలు కూడా నిర్వహించని అధికార యంత్రం
- ప్లాస్టిక్ నిషేధం పై స్వచ్ఛంద సంస్థలు అలుపెరుగని పోరాటం



ప్లాస్టిక్ కవర్లతో కాయగూరలు తెస్తున్న వినియోగదారులు

దెందులూరు: ప్లాస్టిక్ మన నుంచి జీవితంలో ఒక భాగం అయింది. బకెట్లు డబ్బాలు కవర్లు ఇలా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ లేని బతుకు ఊహించడం కష్టమే మరి. ముఖ్యంగా పలుచని ప్లాస్టిక్ కవర్లు వాడకంతో పర్యావరణానికి పెను ప్రమాదం అని పర్యావరణవేత్తల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అమలు మాత్రం ఆరంభ శూన్యంగానే మారింది. దెందులూరు నియోజకవర్గంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా కనిపిస్తుంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి కేంద్ర ప్రభుత్వం 121 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దెందులూరు నియోజకవర్గంలో మండల అధికారులు ఆరంభంలో హడావిడి చేశారు. అయితే 9 నెలలు కావస్తున్న ప్లాస్టిక్ నిషేధం వైపు ప్రజలు అడుగులు ఇంకా పూర్తిస్థాయిలో పడలేదని చెప్పొచ్చు. ముఖ్యంగా దుకాణాల్లో మాంసాహార దుకాణాలతో పాటు టీవీ కణాల్లో చిన్న హోటల్లో ఇంకా పూర్తిస్థాయిలో వాటిని వినియోగిస్తున్నారు.

తనిఖీలేవి..

ఈ ఏడాది జనవరి 1 నుంచి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేసింది. అయితే కొద్ది రోజులు పాటు ప్రజాప్రతితులు అధికారులు నిషేధంపై నానా హంగామా చేశారు. ఇకపై ప్లాస్టిక్ కనిపించరు కనిపించదు కనిపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు కానీ ఆ హెచ్చరికలు మూడు నాలుగు ముచ్చటయ్యాయి. ఇటీవల ప్లాస్టిక్ నిషేధంపై కనీస తనిఖీలు లేవు. ఎప్పుడు అధికారులకు గుర్తొచ్చినప్పుడు చిన్నచిన్న దుకాణాలపై దాడులు చేసి వారికి జరిమానాలు వేసి చేతులు దులుపు వేసుకుంటున్నారు.

స్వచ్ఛంద సంస్థల ఉద్యమం

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ విడవాలని స్వచ్ఛంద సంస్థలు గత కొన్నాళ్లుగా అలుపెరుగని ప్రయత్నం చేస్తున్నాయి. ప్రజల్లో ఉచిత అవగాహన కల్పిస్తూ పాలిథిన్ కవర్ల స్థానంలో వస్త్ర సంచులు వాడాలని కనీసం వారానికి ఒక్కసారి అయినా సరే దెందులూరు నియోజకవర్గంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. దాంతోపాటు ప్రతి ఇంటికి అపారే వచ్చే సంచుల్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అయితే ఆ సంస్థకు మాత్రమే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ప్లాస్టిక్ నిషేధంపై అడుగులు వేయాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

బజారుల్లో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం

బజారుకు ప్లాస్టిక్ నిషేధం పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. కూరగాయలు కోసం పాలిథిన్ కవర్లను అమ్మకాలను నిషేధించాం. వినియోగదారులు తెచ్చుకోవాలని సూచిస్తున్నాం. రైతులకు కూడా ప్లాస్టిక్ వాడొద్దని గట్టిగా చెబుతున్నాం.

ప్లాస్టిక్ వాడకంపై దాడులు చేస్తున్నాం



హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులతో పాటు ప్లాస్టిక్ ఉత్పత్తిదారులకు నిషేధంపై వివరిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యాపారులకు, ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నాం. నిషేధ ఉత్తరం పక్కాగా అమలు చేస్తాం ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం.

జీ విజయకుమార్‌రాజు, తహసీల్దార్, ఏలూరు రూరల్

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు అనేకం



ప్లాస్టిక్ పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. ఆహార పదార్థాలు ప్లాస్టిక్ కవర్లో తీసుకురావడం వల్ల దీర్ఘకాలిక రోగాలు సంక్రమించే అవకాశాలు ఎక్కువ. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకని తగ్గించి సామాజిక బాధ్యతగా చూడాలి.

పెనుమాక వాసు, ఎన్‌జీవో

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి



లండన్‌లో సమావేశం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో లండన్‌లో సమావేశం నిర్వహించారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రభుత్వం ఆపే వరకు పోరాటం చేస్తామన్నారు.

వినూత్న రీతిలో విద్యా బోధన

భీమడోలు: పొలసానిపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలలో టీచర్ కె.మౌనిక విద్యార్థులకు వినూత్న రీతిలో విద్యా బోధన చేస్తూ చక్కని తర్ఫీదును అందిస్తున్నారు. ఇంగ్లిష్ సబ్జెక్టును బోధించే ఆ ఉపాధ్యాయిని చిన్నారులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఆమె బోధనోపకరణాలను (టీఎల్ఎం)లను తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. గత ప్రభుత్వం నాడు-నేడు పథకంలో ఈ పాఠశాలను అభివృద్ధి చేసి రూపు రేఖలను మార్చింది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన అన్ని వసతులను కల్పించింది. ఇక్కడి విద్యార్థుల ఆధారంగా మోడల్ ప్రైమరీ పాఠశాలగా మారడంతో హెచ్ఎం కోలా ఉమా మహేశ్వరరావుతో పాటు మరో నలుగురు ఉపాధ్యాయులు కె.పరమానందం, కె.మౌనిక, కె.వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి పని చేస్తున్నారు. అన్ని తరగతుల్లోనూ విద్యార్థులకు ఉపాధ్యాయులు చక్కగా బోధిస్తున్నారు. వీరిని పాఠశాల సిబ్బంది అభినందిస్తున్నారు.



చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధన చేస్తున్న ఉపాధ్యాయిని

వృద్ధులకు ఆహారం పంపిణీ

కామవరపుకోట: ఆకలితో ఉన్న పేదలకు, వృద్ధులకు తన వంతు సహాయం చేస్తానని స్థానిక శ్రీసురక్ష ట్రస్ట్ అధ్యక్షుడు దాసి భూషణం అన్నారు. ఆదివారం ఆయన కామవరపుకోటలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు అందజేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - తిరుపతి	16.00	4830	28

వైభవంగా అమ్మవారి ఊరేగింపులు



దెందులూరు: అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



భీమడోలు: అమ్మవారి ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషాలు

భీమడోలు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో దేవి నవరాత్రి ఉత్సవాల ముగింపుతో ఆదివారం అమ్మవార్ల గ్రామోత్సవాలు వైభవంగా నిర్వహించారు. భీమడోలులోని గుర్రాల చెరువు గట్టు వద్ద వేంచేసియున్న శ్రీకనకదుర్గదేవి ఊరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. ఊరేగింపులో గణాచారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో అమ్మవార్లను ఊరేగించారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం

దెందులూరు: దెందులూరులో మేకాలమ్మ చెరువు గట్టు ప్రాంతంలోని కనకదుర్గ విగ్రహ ఊరేగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై ఆర్.శివాజీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



భీమడోలు: ప్రత్యేక వాహనంలో ఊరేగుతున్న అమ్మవారు



దెందులూరు: దాత హరికృష్ణను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దాత హరికృష్ణకు సత్కారం

ఎన్నారై ఇంజనీర్ ఏనుగు హరికృష్ణను ఆదివారం గోపన్నపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ, కేబుల్ శ్రీను ఆలయ అర్చకులు హర్షా శర్మ సత్కరించారు.

ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ ఎంపిక

కుక్కునూరు: ఆదివాసీ సంక్షేమ పరిషత్ నూతన మండల కమిటీ ఎంపిక ప్రక్రియ ఆదివారం రాష్ట్ర నాయకుడు కుంజా శ్రీను ఆధ్వర్యంలో కుక్కునూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా సరియం ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జెడ్డి రఘుబాబు, ఉపాధ్యక్షుడిగా వెట్టి వెంకన్న, సహాయ కార్యదర్శిగా కుంజా ముత్తయ్య, కోశాధికారిగా పైదా చిన్నబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పాడియం వేణుగోపాల్, పైదా బొర్రయ్య, పూజారి లక్ష్మీనారాయణ, శివ పాల్గొన్నారు.